సూర్య
www.suryaa.com
17 వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,29 మార్చి 2024


# ఉన్న బస్ రద్దు చేయడం ధర్మమా..!

**-సి.పి.ఐ.ఎం.ఎల్ కేంద్ర కమిటీ సభ్యులు కెచ్చల రంగారెడ్డి**



**వి.ఆర్.పురం,మేజర్న్యూస్ :** గతంలోఉన్న బస్ సర్వీసులు రద్దు చేయడం ధర్మంగా ఉందాని ఏ.పి.ఎస్,ఆర్.టి.సి.అధికారులను సి.పి.ఐ,(ఎం.ఎల్.)కేంద్ర కమిటీ సబ్యులు కెచ్చల రంగారెడ్డి, అధికారులను ప్రశ్నించారు.గురువారం,ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడిరాష్ట్రంలో భద్రాచలం నుండి పోచవరం, వరకు నడిపిన ఆర్టీసీ అధికారులు రాష్ట్రం విడిపోయాక రద్దుచేయడం ధర్మంగాఉందానిఆయన ప్రశ్నించారు.వరరామ చంద్రాపురం, రేఖపల్లి, నుండి గ్రామాలకు పనులపై వెళ్లే వారి పరిస్థితులు ఒక్కసారి ఆలోచించండని కోరారు.బస్లు లేక ఏజెన్సీ కొండరెడ్డి గిరిజనులు నానా ఇబ్బందులు(కష్టాలు) పడుతున్నారని,అధికారులు పునరాలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిచో ప్రజలందరినీ ఏకం చేసి ఆందోళనలు చేపడతామని ఆయన గుర్తుచేశా రు.గతంలో వరరామచం ద్రాపురం,నుండి హైదరాబాద్కు బస్ ఉండేదని, విజయవాడకు కూడా ఉండేదని,బస్లు రద్దుచేయడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కుంటిసాకులు చెప్పకుండా,అధికారులు సహకరించా లని కోరారు. ఈ ప్రెస్నోట్ విడుదల చేసిన వారిలో రాష్ట్ర మహిళా నాయకురాలు కెచ్చేల కల్పన ఉన్నారు.

## పిఠాపురంలో

# జంప్ జిలానీలు రెడీ..




**-ఎన్నికల వేళ రాజీనామా డ్రామాతో పార్టీ మారే యోచన**

**-ఆప్కాస్ నియామకాల కేంద్రంగా నేతల స్కెచ్**

**పిఠాపురం,మేజర్న్యూస్ :** పిఠాపురంలో జంప్ జిలానీలు రెడీ అయ్యారా... కోవర్ట్ రాజకీయాలు అప్పుడే మొదలయ్యాయా అంటే అవును అనే సమాధానం వినిపిస్తుంది. కోవర్టు రాజకీయ నాయకుల బెడద జనసేన, వైఎస్ఆర్సిపీ పార్టీలకు మెండుగా కనిపిస్తుంది. ఈ నెల చివరి తేదీలలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పర్యటిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో... పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరేందుకు కొంతమంది నాయకులు తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తుంది. ఈ నాయకులలో వైఎస్ఆర్సిపీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర కౌన్సిలర్ కూడా ఉన్నట్టు వినిపిస్తుంది. వీరంతా వైఎస్ఆర్సిపిని వీడి రాజీనామాలు చేసేందుకు సిద్ధమయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. మరొక పార్టీ నుంచి బంపర్ ఆఫర్ రావడంతోనే పార్టీని వీడుతున్నారన్న చర్చ జోరుగా నడుస్తుంది. వీరంతా ఒకచోట సమావేశం నిర్వహించి చర్చించుకున్నట్టు సమాచారం. మరి కొంతమంది నేతలకు కూడా ఫోన్లు చేసి నీ పరిస్థితి ఏమిటంటూ అడుగుతున్నట్టుగా తెలుస్తుంది. సాధ్యమైనంత మేరకు మరికొంత ఎక్కువ మంది కలిసి వచ్చేలా రూపకల్పన చేసుకున్నారన్న వినికిడి వినిపిస్తుంది. ఏ కారణమూ లేకుండా బయటకు వెళ్తే బాగోదన్న సూచనలతో... ఇటీవల పిఠాపురం మున్సిపాలిటీలో జరిగిన ఆప్కాస్ నియామకాలను తెరపైకి తీసుకు వస్తున్నట్టు తెలుస్తుంది. ఆప్కాస్ నియామకాలు తమకు తెలియకుండా జరిగాయని, అందుకే తాము మనస్థాపం చెందామని, ఈ నియామకాలలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేసేందుకు వారు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుండి పోటీ చేస్తున్న నేపథ్యంలో... పిఠాపురం రాజకీయాలు మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎవరు ఎంతమంది పార్టీని వీడి వెళ్లినా... పార్టీకి ఏమి నష్టం లేదని, వారు వెళ్లినా వారి స్థానంలో మరి కొంతమంది నేతలు వచ్చి చేరుతారని వైఎస్ఆర్ సీపీ నేతలు చెబుతున్నారు.

**-ఆప్కాస్ నియామకాలు చట్టబద్ధంగా జరిగాయి : కమిషనర్**

ఆప్కాస్ నియామకాలు చట్టబద్ధంగా జరిగాయని, ఈ నియామకాలకు సంబంధించి జనవరి 18- 2021న ఫైలు మూవ్ అయిందని, గత సంవత్సరం అనగా డిసెంబర్ 23న ఫైల్ అప్రూవయిందని, పై విషయాలు అన్నీ నేను రాకముందు జరిగినవని, నియామకాల ప్రక్రియలో భాగంగా ఈనెల 14వ తేదీన అపాయింట్మెంట్ లెటర్లు మాత్రమే ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు.

# ఏజెన్సీలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు



**- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ గ్రామాల్లో వేసవి కాలంలో త్రాగునీరుకు ఇబ్బంది లేకుండా ప్రతీ గ్రామంలో మంచి నీటి బోర్లు మరమ్మత్తులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి, ఆర్ డబ్ల్యు ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ప్రాజెక్ట్ అధికారి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో మారుమూల గ్రామాలతో సహా అన్ని గ్రామాలలో త్రాగునీరు ఎద్దడి లేకుండా త్రాగునీరు ఏర్పాటు కోసం యాక్షన్ ప్లాన్ ప్రకారం పనిచేయాలన్నారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం పరిధిలో మొత్తం 3,550 మంచి నీటి బోర్లు ఉండగా, ఇందులో ఒక్కొక్క మండలంలో ఎన్ని బోర్లు రిపేర్లు ఉన్నవి మండలాలవారీగా ఆయన ఆరా తీశారు. అదేవిధంగా ఒక్కొక్క మండలంలో ఎన్ని బోర్లు ఉన్నవి, ఆ బోర్లలో త్రాగునీటి కోసం ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి, అదేవిధంగా ఆయా బోర్లలో త్రాగునీటికి పనిచేయని బోర్లను ఏవిధంగా గుర్తించుచున్నది, ఆ బోర్లలో త్రాగడానికి పనికిరావని వాడుకోవడానికి పనికి వస్తాయని ప్రజలకు ఏవిధంగా తెలియజేయుచున్నది ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో సత్యసాయి పథకం ద్వారా, జల జీవన్ మిషన్ ద్వారా ఎన్ని గ్రామాలలో ప్రజలకు త్రాగునీరు అందిస్తున్నారో మండలాల వారీగా పిఓ ఆరా తీశారు. బోర్లు ద్వారా త్రాగునీరు ఏవిధంగా పరీక్షలు చేయుచున్నది, అదేవిధంగా ఎక్కడెక్కడ చేయుచున్నది ఆరా తీశారు. ఏజెన్సీలో అన్ని మండలాలలో ఏ గ్రామాలలో వాటర్ ట్యాంకులు ఎన్ని ఉన్నవి మండలాల వారీగా ఆయన అడిగారు. అన్ని గ్రామాలలో బోర్లు రిపేర్లు ఏ పరికరాలు కావలసి ఉన్నది ఆరా తీశారు. ఏజెన్సీలో మారుమూల గ్రామాలలోని ప్రజలు కాలువలలో చెలమలు తీసుకొని త్రాగునీరు వాడుకుంటున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు త్రాగునీరు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించడం జరిగింది. వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీరు ఎద్దడి లేకుండా ఎక్కడికక్కడ త్రాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఆర్.డబ్ల్యు.ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్ర బాబు,శివ,యస్ఓ టి.మార్తమ్మ, ఏడు మండలాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఓటు వేయడం ఓటర్ బాధ్యత

**-ఓటు ఓటర్ చేతిలో బ్రహ్మాస్త్రం**

**-తహసీల్దార్ & ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఓటు వేయడం ఓటర్ బాధ్యతని, ఓటు ఓటర్ చేతిలో బ్రహ్మాస్త్రం మని,తహ సీల్దార్ &ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్ స్పష్టం చేశారు. గురువారం వడ్డిగూడెం, రాజపేట గ్రామాల్లో గ్రామస్తు లుతో ఓటర్ అవగాహానా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఓటు తప్పనిసరిగా వేయాలని సూచించారు.ఏలాంటీ ప్రలోభాలకు గురికావద్దని ఆయన కోరారు.ఇంట్లోవుండి ఓటు వేయకుండా ఉండటం సరికాదని ఆయన అన్నారు.ఓటింగ్ బూత్ లో డ్రింకింగ్ వాటర్,టెంట్లు,సౌకర్యాలు కల్పిస్తామని ఆయనతెలియజేశారు.ఓటు విలువ ఐదేళ్ళని,తూచా తప్పకుండా ఓటువేచి మిగతావారికి ప్రేరణగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ రవ్వా రామయ్య,సెక్రెటరీ గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

# పోలింగ్ నిర్వహణపై ఓటర్లకు అవగాహన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు బియల్ఓ ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం తహసిల్దార్ ఎ.కృష్ణ జ్యోతి పేర్కొన్నారు. గురువారం రంపచోడవరం మండలం పరిధిలోని ఫోక్స్పేట, కె.ఎర్రంపాలెం, గోపవరం, ఐ.పోలవరం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను తహసిల్దార్ గురువారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణజ్యోతి మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రంలో రంపచోడవరం సబ్ కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసామన్నారు. అదేవిధంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో వికలాంగులకు ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు ర్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా వికలాంగులు ఓటు వేయడానికి వచ్చినప్పుడు లైన్లో లేకుండా వెసులుబాటు కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో బిఎల్ఓ లు ద్వారా ఓటర్లకు అదేవిధంగా వికలాంగులకు ఎన్నికలకు సంబంధించిన అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. 18 సంవత్సరములు నిండిన యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అదేవిధంగా త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ఈవీఎంలపై గుర్తులు ఉంటాయని ఓటర్లకు ఆమె తెలియజేయడం జరిగింది. తహసిల్దార్ వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ విగ్నేష్, వీఆర్వోలు, బిఎల్వో లు పాల్గొన్నారు.

# ప్రజల అభీష్టం మేరకే భవిష్యత్తు కార్యచరణ

**-మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి**

**-పార్టీ విధానంపై తెలుగు తమ్ముళ్ళ ఆగ్రహ జ్వాలలు**

**-పార్టీ కరపత్రాలు, జెండాలు, సైకిల్ దగ్ధం**

**-రామవరంలో ఉద్రిక్త వాతావరణం**

**-ఆత్మహత్య ప్రయత్నం చేసిన కార్యకర్తలు**

**-తుది శ్వాస వరకు కార్యకర్తలను కాపాడుకుంటా అని భరోసా ఇచ్చిన నల్లమిల్లి - నల్లమిల్లిని బుజ్జగించేందుకు ప్రయత్నించిన చంద్రబాబు**





**అనపర్తి, మేజర్ న్యూస్ :** రామవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనపర్తి నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్ధిగా బిజెపికి చెందిన శివరామకృష్ణంరాజు ను ప్రకటించిన విషయం తెలిసింది. అనపర్తి నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కాదని, బిజెపికి కేటాయించడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానంపై పార్టీ నాయకులు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కరపత్రాలను, పార్టీ జెండాలను, పార్టీ గుర్తు సైకిల్ ను దగ్ధం చేశారు. తెలుగుదేశం పార్టీని నమ్ముకుని, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కాపాడుతూ పార్టీ తరఫున అనేక పోరాటాలు చేసిన రామకృష్ణారెడ్డికి పార్టీ అన్యాయం చేసిందని తెలుగు తమ్ముళ్లు ఆవేశం కట్టలు తెంచుకున్నాయి. ఇద్దరు కార్యకర్తలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేయగా, మరొక కార్యకర్త బిల్డింగ్ పై నుండి దూకి ఆత్మహత్య చేసే ప్రయత్నం చేశారు. వారిని రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిలువరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి గత 42 సంవత్సరముల నుండి నేను నా కుటుంబం వెన్నింటే ఉంటూ పార్టీకి ఎనలేని సేవ చేసామని, పార్టీ కోసం ప్రాణాల్లోడ్డి పోరాడితే నన్ను బలి చేయడం చాలా బాధాకరమని అన్నారు. అధిష్టానం అనపర్తి నియోజకవర్గ టికెట్టు బిజెపికి అప్పగించడం నాలో చాలా ఆవేదన కలిగిస్తుందని, గత ఐదు సంవత్సరములుగా ఎన్నో ఒడుదుడుకులు తట్టుకుంటూ ఎన్నో పోరాటాలు చేసామని, నాపై అక్రమంగా 39 కేసులు, పార్టీ నాయకుల పైన 189 అక్రమ కేసులు నమోదు చేయడం జరిగిందని, ఎన్ని కేసులు నమోదు చేసిన వెనకడుగు వేయకుండా పార్టీ కోసం, ఉనికి కోసం, పార్టీ భవిష్యత్తు కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నామని అన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాకు అనేక బాధ్యతలు అప్పగించే వారిని, వాటిని అన్నింటిని పట్టుదలతో పనులను పూర్తి చేసి అధినేతకు అప్పగించడం జరిగిందని, నారా లోకేష్ కూడా నా పోరాటాలను మెచ్చుకునే వారిని కానీ ఈరోజు ఈ పరిస్థితి చూస్తుంటే ఎవర్ని నమ్మాలో అర్థం కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉద్దేశించి ప్రసంగిస్తూ తనకోసం ఎవరు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ప్రాణత్యాగం చేయవద్దని ఆవేదనకులోనై కన్నీరు పెట్టుకున్నారు. ఇక భవిష్యత్తు కార్యచరణ విషయానికి వస్తే ప్రజల అభీష్టం మేరకే నా భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని, రానున్న ఐదు రోజులు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజల్లోకి వెళతానని తదుపరి ప్రజలు కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకు నా భవిష్యత్తు కార్య చరణ ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మనము తీసుకునే కార్యకరణ ప్రకారం ప్రణాళిక వేసుకుని ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేసి మన పోరాట ఫలితాన్ని చూపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై తెలుగుదేశం పార్టీ తరఫున నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేసి విజయం సాధించడం ఖాయమని, ఆయన తప్ప ఇతర ఏ పార్టీ కూడా విజయం సాధించలేదని ఆ విషయం తెలుగుదేశం పార్టీ అధిష్టానం కూడా తెలుసని, అనపర్తి నియోజకవర్గంలో విజయ కేతనం ఎగరవేయాలంటే రామకృష్ణారెడ్డి వల్లే అవుతుందని, అది తెలుగుదేశం పార్టీ అధిష్టానం గ్రహించాలని అన్నారు. ఏది ఏమైనా రామకృష్ణారెడ్డి వెంటే కార్యకర్తలు అందరూ కూడా నడుస్తామని ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటామని అన్నారు. ఉద్రిక్త పరిస్థితులను తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నం చేశారని, నల్లమిల్లికి ఫోన్ చేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు సహకరించాలని తెలిపినప్పటికీ, అధినేతకు నియోజకవర్గ పరిస్థితిని, కార్యకర్తల ఆవేదనను నల్లమిల్లి వివరించారని తెలిపారు. రానున్న రోజుల్లో నల్లమిల్లి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతారా.. పార్టీకి రాజీనామా చేసి ప్రజల కోసం ప్రజలతో మమేకమై ప్రజా నిర్ణయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా అనే విషయమై నియోజకవర్గమంతా చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లోతో అనపర్తి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రెడ్డి సామాజివర్గానికి చెందిన అనపర్తి నియోజకవర్గంలో వేరే వర్గానికి చెందిన వ్యక్తిని అభ్యర్థిగా నిలబెడితే ఆ ఎఫెక్ట్ రెండు జిల్లాలలోని ఉమ్మడి కూటమిపై ప్రభావం చూపుతుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదని అనుకుంటున్నారు.

# ఎన్నికల కోసం 'కంట్రోల్ రూమ్'

**- ఆర్వో జే వెంకటరావు వెల్లడి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు తెలిపారు. మిలిటరీ రోడ్ శారదాదేవి ఆలయ ప్రాంతంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న రజక కమ్యూనిటీ హాల్ భవనంలో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటయిందన్నారు. 24 గంటలూ నిరంతరాయంగా పనిచేసేలా మూడు షిఫ్ట్ లలో 12 మంది ఉద్యోగులు ఈ కంట్రోల్ రూమ్లో పనిచేస్తారన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు, సమస్యలు ఉంటే ప్రజలు ఈ కంట్రోల్ రూమ్కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చున న్నారు. కంట్రోల్ రూమ్ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2349400 కు సమాచారం అందజేయవచ్చు నని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టవంతంగా అమలు చేసేందుకు ప్రజలు సహకరించాలని ఆర్వో కోరారు. ఈ కంట్రోల్ రూమ్ కేవలం ఎన్నికలకు సంబంధించి మాత్రమే ఏర్పాటు చేశామని ఆర్వో స్పష్టం చేశారు.

# రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీనిఅత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**-మాజీ ఎమ్మెల్యే శేషారావు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం లో పెరవలి ,ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో మార్చి 28వ తేదీ గురువారం జరిగిన టీడీపీ- జనసేన- బిజెపి కార్యకర్తల సమావేశంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన , బిజెపి వుమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్, నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి బూరుగుపల్లి శేషారావు లు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.మాజీ శాసన సభ్యులు శేషారావు మాట్లడుతూ టీడీపీ , జనసేన నాయకులు కార్యకర్తలు సమష్టి గా మన వుమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ గారిని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు.అదేవిధంగా జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీ బిజెపి పార్టీ ల వుమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లడుతూ శేషారావు గారి సలహాలూ , సూచనలతో పెరవలి మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు.జనసేన టీడీపీ కార్యకర్తలు ఈ సమయాన్ని ఉపయోగించి ప్రజల్లోకి పార్టీ గుర్తు గాజుగ్లాస్ ను తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోకవర్గ జనసేన నాయకులు భోగవల్లి ప్రసాద్, పెరవలి మండల టీడీపీ అధ్యక్షులు అధికాల శ్రీను, పెరవలి మండల జనసేన అధ్యక్షులు పిప్పర రవి, టీడీపి మండల నాయకులు వాకలపుడి వీర్రాజు, భూపతిరాజు రవివర్మ,నల్లాకుల శ్రీను, కంటిపూడి సూర్యనారాయణ వెంద్ర వెంకట రామూర్తి, నల్ల సురేంద్ర అక్కిన రాజు రెడ్డి సత్యనారాయణ హనుమంతు జనసేన మండల నాయకులు నందిప శ్రీనివాస చక్రవర్తి ,పాలా వీరాస్వామి,చినబాబు ,నాని, రాజేష్,సత్తిబాబు, వెంకటేశ్వర రావు ,రాంబాబు తధితర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# తాటాకిల్లు దగ్ధం

**- రూ.4 లక్షలు ఆస్తి నష్టం**



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** పుల్లేటికుర్రు శివారు వాజ్ పేయ్ కాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై రూ.4 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. గాడా నాగబాబుకు చెందిన తాటాకింటిలో గ్యాస్ సిలండర్ నుండి మంటలు చెలరేగి ఒక్కసారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నాగబాబు ఇంటిలో కుమార్తె వివాహానికి చీటీ పాడి తెచ్చుకున్న 12 గ్రాముల బంగారం, రూ.2.80 లక్షలు బూడిద పాలయ్యాయి. వీటితోపాటు గృహోపకర వస్తువులు, రేషన్, ఆధార్ కార్డులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక అధికారి కె.వి.కొండబాబు తన సిబ్బంది ఎల్ఎఫ్ వి.ప్రభాకరరావు, డీవోపీ వై.శ్రీనివాస్, జి.శ్రీను, ఎస్.లక్ష్మణ్ లు మంటలను అదుపు చేశారు.

## మిథుల్ కుమార్ జైన్‌కు కీలక బాధ్యతలు



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం రామచంద్రపురం పట్టణానికి చెందిన మిథుల్ జైన్ కు జనసేన పార్టీలో మంచి గుర్తింపు లభించింది. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరి నుండి జనసేన పార్టీ అధికార ప్రతినిధి హరిప్రసాద్ ఈనెల 30వ తేదీ నుండి పవన్ కళ్యాణ్ పాల్గొనే ఎన్నికల సభలలో భద్రతా వ్యవహారాలు చూసుకునేందుకు మిథుల్ జైన్ కు కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా జైన్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, నాపై విశ్వాసం ఉంచిన పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ నెల్లిపాక ఆరోగ్య ఉప కేంద్రం సందర్శన



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం, నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెల్లిపాక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు గురువారం సందర్శించారు. గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలు ఆరా తీశారు. అనంతరం రికార్డ్స్ పరిశీలన, ఆరోగ్య భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు, బాలింతలకు హెచ్.బి. పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంలో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్.ఓ. క్రైలాష్, డిపిఒ సతీష్, సి.సి. మణికంఠ, డాక్టర్ ప్రత్యుష్, డాక్టర్ విష్ణు ప్రియ మరియు పిహెచ్ఎన్ ఏఎన్ఎం లు సంధ్యారాణి, రమణి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్స్, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశ కార్యకర్తలు మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్రేయపురం వైసీపీలో ఎవరికి వారే యమునా తీరే

### - ఎన్నికల వేళ క్యాడర్‌లో అయోమయం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామంలో వైసీపీ క్యాడర్‌లో అయోమయం నెలకొని ఉంది. గ్రామంలో ముఖ్య నాయకులు ఎవరికి వారే యమునాతీరేఅనేవిధంగా వ్యవహరిస్తు డడంతో ఆత్రేయపురంలో వైసీపీకి రానున్న ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని గ్రామంలో జోరుగా ప్రచారం సాగుతుంది. గ్రామ పార్టీలో తరచుగా అసమ్మతి సెగలు పెరగడం, ముఖ్య నాయకులు వచ్చి బుజ్జగించడం, మరలా కొంతకాలానికి నాయకులు అలక వహించడం పరిపాటిగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. పార్టీలో నాయకులు ఒక్కొక్కరిగా అలక వహించి తిరుగుబాటు జెండా ఎగురవేస్తుండడంతో వారిని బుజ్జగించేందుకు నియోజకవర్గస్థాయి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నా పరిస్థితి చక్కదిద్దుకోవడంలేదు.నియోజకవర్గస్థాయి నాయకులు ఆత్రేయపురంలో ఉన్న వేరే ఊర్ల నుండి వచ్చి ఇక్కడ సాగించడం కొత్తగా పార్టీ ఆఫీస్ తెరవడం జీర్ణించుకోలేకపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల నాటికి ఆత్రేయపురం గ్రామంలో వైసీపీ పూర్తిగా కాళీ అయ్యే పరిస్థితి నెలకొందని పార్టీ క్యాడర్ ఆందోళన చెందుతున్నారు. అధినాయకత్వం కూడా గ్రామంలో ముఖ్య నాయకులను పక్కనపెట్టి తృతీయ శ్రేణి నాయకులతో కార్యక్రమాలు నడుపు తుండడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆత్రేయపురం గ్రామం నుంచి నాయకులు భారీ మెజారిటీ అందించారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి చెందిన ముఖ్య నాయకులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఒక్కొక్కరిగా పార్టీ విజయానికి పనిచేసేది లేదంటూ అసమ్మతిరాగం వినిపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొట్లాది రూపాయలు ఖర్చు చేసిన తమను కాదని పార్కింగ్ పనులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, మండల కేంద్రమైన ఆత్రేయపురంలో ఇసుక రిచ్ లేకుండా చేసి స్థానికులను గృహ నిర్మాణదారులకు ఇసుక ఇబ్బందులకు గురిచేయడం, చోట మోట నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తనను ఇబ్బందులు గురి చేశారని ముఖ్య నాయకుడు పార్టీకి బై బై చెప్పేందుకు రంగం సిద్ధం అయ్యారు. ఇప్పటికే సహకార సంఘం అధ్యక్షులు పార్టీకి గుడ్ బై చెప్పడం తెలిసిందే. అయితే మరో ముఖ్య నాయకుడు కూడా కొత్తపేట నియోజకవర్గంలో నామినేషన్ల పర్వం ప్రారంభమైన అనంతరం పార్టీకి గుడ్ బై చెప్పడం ఖాయంగా అనిపిస్తుంది. ఈ నెలలో రావులపాలెం సిఆర్‌సి లో జరిగిన సామాజిక సాధికారత సమావేశానికి ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు హాజరు కావాలంటూ పార్టీ నుండి స్వయంగా పిలుపు వచ్చినా గ్రామం నుంచి ఏ ఒక్క నాయకుడు హాజరు కాకుండా సమావేశానికి డుమ్మ కొట్టారు. దీంతో గ్రామంలో పార్టీ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడు పార్టీ విజయవకాశాలు దెబ్బతీసే అవకాశం ఉందని అంచనాకు వచ్చిన వైఎస్ఆర్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు గ్రామంలోని తృతీయ శ్రేణి నాయకులతో ఎన్నికలు ఎదుర్కొని గ్రామంలో మెజార్టీ సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చిన వారిని కాదని చోట మోట నాయకులకు అధికారం అప్పగించడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని పార్టీ క్యాడర్ గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు ఆత్రేయపురం గ్రామంపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో కృషి చేయకపోతే రానున్న ఎన్నికల్లో ఓట్లకు భారీగానే గండి పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ద్వారంపూడిని కలిసిన శెట్టిబలిజ నేత, ఎమ్మెల్సీ కుడిపూడి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు గురువారం సాయంత్రం సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. రానున్న ఎన్నికల్లో శెట్టిబలిజల తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన ఎమ్మెల్యే ద్వారంపూడికి హామీ ఇచ్చారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో శెట్టిబలిజ కులస్తులకు అన్ని విధాల అండగా నిలిచి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 630 గజాల స్థలం మంజూరు చేయడంతోపాటు రాజకీయంగా కూడా సముచిత ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూడా రాష్ట్రస్థాయిలో శెట్టిబలిజలకు రాజ్యసభను కేటాయించడంతోపాటు తమ సామాజికవర్గ అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. అందువల్ల కాకినాడ సిటీలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఘనవిజయమే లక్ష్యంగా శెట్టిబలిచే సామాజికవర్గం తరపున త్వరలోనే విస్తృత ప్రచారం చేస్తామని ఆయన చెప్పారు.

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా శెట్టిబలిజ సామాజికవర్గం తనకు అండగా నిలిచిందని, రానున్న ఎన్నికల్లో కూడా ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి వెంట పలువురు శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన అలమండ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి అలమండ సత్యవతి చలమయ్య దంపతులు రాజీనామా ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము వైకాపా పార్టీ సభ్యతానికి మాత్రమే రాజీనామా చేస్తున్నామని తమ పదవులు కాదన్నారు. తాము నగర పంచాయతీ అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు స్థానికేతర నాయకులు వాటిని అమలుపరచకుండా అడ్డు తగలడంతో మనస్థాపాల గురై రాజీనామాను చేస్తున్నట్లు వారు తెలిపారు. రాజీనామా విషయం తెలుసుకున్న స్థానికులు విభిన్న స్వరాలు వినిపిస్తున్నారు. వారి మాటల్లో నగర పంచాయతీ అభివృద్ధి పేరిట ఏల్లేశ్వరం బాలాజీ సెంటర్లో ఉన్న షాపులను అర్ధరాత్రి కూలగొట్టి వారికి జీవనోపాధిని లేకుండా చేసిన వారు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా ఇన్చార్జిగా వరుపుల సుబ్బారావును ప్రకటించడంతో బాధితులు తమ గోడును ఆయనకు వినిపించారు. దీంతో బాధితులకు వరుపుల అండగా ఉంటూ షాపులు నిర్మాణానికై తమ వంతు సహాయ సహకారాలను అందించారు. బాధితులకు జీవనోపాధి కల్పించేందుకు వరుపుల ముందుకు వచ్చారు. దీంతో అలమండ ప్రాధాన్యత పార్టీలో పట్టణంలో తగ్గుతూ వస్తుంది. ఇది తట్టుకోలేక పార్టీకి మాత్రమే రాజీనామా చేయడం, పదవులకు చేయకపోవడంపై ప్రజల్లో చర్చాంశాలమైంది. పార్టీ గుర్తుపై గెలిచి పార్టీకి అండగా ఉండవలసిన కాలంలో పార్టీని వదిలిపెట్టి పోవడం ఎంతవరకు సమంజసం అని పట్టణంలో గుసగుసలు తినిపిస్తున్నాయి.

## బాల్య వివాహాలు నిర్ములనపై అవగాహన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు ఐ సి డి యస్ ప్రాజెక్ట్ సామర్లకోట మండలం ఆధ్వర్యంలో మండలంలోని పెద్దబ్రహ్మదేవం జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్ కిషోర బాలికలుకు బాలల హక్కులు మరియు పరిరక్షణ మరియు బాలలపై జరుగుతున్న వేధింపులు అరికట్టడం గురించి బాల్య వివాహాలు నిర్ములనపై గురువారం అవగాహనా కల్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఎన్ఐసి) జె విజయ మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండావివాహం చేస్తే వారి మీద చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా వాటిని ప్రోత్సహించిన సహకరించిన లక్ష రూపాయలు జరిమానా మరియు రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. బాలలు బడికి వెళ్లి పాఠాలు, ఆటలు ఆడుకొని ఆనందగా చిన్నారుల బాల్యం సాగిపోవలని ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చేది బాల్యమే అలాంటి బాలికల బాల్యానికి మూడుముళ్ల బంధం వేయకూడదన్నారు బాల్య వివాహాలు చేయడం ద్వారా జరిగే అనర్థాలు అనేకం ఉన్నాయని చిన్నవయసులోనే పెళ్లి చేయడం వల్ల లైంగిక దోపిడీకి గురి అవ్వడం ద్వారా గర్భం దాల్చడం గర్భస్రావం అవ్వడం, మాతా శిశు మరణాలు సంభవిస్తాయి అని తెలియజేసారు, బాల్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిసిన, బాలలను వేదిపులకు గురిచేసిన కనిపించినా వెంటనే చైల్ లైన్ 1098 ఉచిత సేవ నెంబరు కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు, ఈ కార్యక్రమంలో పాటశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శివ ప్రసాద్, సి.ఆర్.పి కె. ఉమా మహేస్వరావు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ 'విజన్' కు అవార్డుల పంట



**కాకినాడ, మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ కాకినాడ విజన్‌కు లయన్స్ ప్రాంతీయ సదస్సులో పలు పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.వి.ఎస్.ఎల్. ప్రసూన మాట్లాడుతూ సామర్లకోటలో జరిగిన లయన్స్ ప్రాంతీయ సదస్సులో రీజియన్ చైర్మన్ సి.హెచ్. శ్రీదేవి చేతుల మీదుగా 16 పురస్కారాలను అందుకున్నామన్నారు. అందు ముఖ్యంగా రీజియన్ పరిధిలో ఉత్తమ లయన్‌గా తనకు పురస్కారం లభించడం గర్వకారణం అన్నారు. ఇంతవరకు ఇటువంటి పురస్కారం ఏ మహిళకు లభించలేదని అన్నారు. ఉత్తమ క్లబ్, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, ఉత్తమ సేవా కార్యక్రమాలకు గాను ఈ పుష్కరాలు లభించాయని అన్నారు.ఈ ఏడాది తమ క్లబ్బు నిర్వహించిన సేవా కార్యక్రమాలకు తగిన గుర్తింపు లభించిందని ప్రసూన తెలిపారు.ఈ ప్రాంతీయ సదస్సులో తమ క్లబ్బు కార్యదర్శి ఎన్. శ్రీదేవి రెడ్డి, కోశాధికారి బి. శ్రీవాణి, సభ్యులు ఎం. రమాసుందరి, సి.హెచ్. విజయలక్ష్మి,ఎం.మీనాక్షి తదితరులు పాల్గొన్నట్లు ప్రసూన తెలిపారు.

## అంధుల మధ్య వివాహ వార్షికోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక అచ్చంపేట జంక్షన్ రెడ్ క్రాస్ సొసైటీ అంధుల పాఠశాలలో స్వామి విద్యానికేతన్ అధినేత స్వామి దంపతుల వివాహ వార్షికోత్సవం ఘనంగాజరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ పుట్టినరోజు వలెనే పెళ్లి రోజు కూడా అత్యంత ప్రధానమైనదన్నారు. ఇద్దరు వ్యక్తులను ఒకటిగా చేసే వివాహం కుటుంబవృక్షానికి మూలమన్నారు. ఈ సందర్భంగా దంపతులిద్దరూ వివాహ దినోత్సవం పురస్కరించుకుని కేకు కట్ చేసి విద్యార్థులకు విందునిచ్చారు. అనంతరం స్వామి దంపతులను అడబాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ అందుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎస్ఐపై దాడి

### - ఇద్దరు యువకులు అదుపులోకి





**కరప, మేజర్ న్యూస్ :** ట్రాఫిక్ వన్ కాకినాడ ఎస్ఐ కిషోర్, సిబ్బంది గురువారం సాయంత్రం కాకినాడ యానం రోడ్‌లో ఉప్పలంక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంతలో సిబిజెడ్ వాహనం పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిని పరీక్షించుగా మద్యం తాగినట్టుగా తేలింది. దీంతో ఎస్ఐ వారితో మాట్లాడుతుండగా ఈ వాహనంపై వచ్చిన పాలెపు రాజు, కర్రి కేశవ అనే ఇద్దరు వ్యక్తులు ఎస్ఐ పైన, హోమ్ గార్డ్ పైన తిరుగుబడ్డారు. అందులో ఒకరిది కాకినాడ డైరీ ఫాం సెంటర్ కాగా మరొకరిది రామారావుపేటగా గుర్తించారు. ఎస్సైకు మొహంపై తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సమాచారాన్ని కాకినాడ వన్ ట్రాఫిక్ సిఐ నూనె రమేష్ కరప పోలీసులకు అందజేశారు. కరప ఎస్ఐ రామకృష్ణ నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గాయపడ్డ ట్రాఫిక్ ఎస్ఐ ను ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

# సువిధ యాప్ ద్వారా 24 గంటల్లో అనుమతుల మంజూరు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అన్ని అనుమాతులను సువిధ యాప్ ద్వారా 24 గంటల్లో మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కృతికాశుక్లా రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కృతికాశుక్లా.. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఇతర ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో సజావుగా పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కలెక్టర్..రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల షెడ్యూల్, ఓటర్ల జాబితా, ఫారం 6, 7, 8 లకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, ఈ-ఏపిక్ కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీపాడ్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన, స్టోరేజ్ పాయింట్, కౌంటింగ్ కేంద్రాలు, కంట్రోల్ రూములు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి అంశాలపై ఈ సందర్భంగా కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన మార్గదర్శకాలను, సూచనలను ప్రతి వారం రాజకీయ పార్టీ ప్రతినిధులకు సమావేశాలు నిర్వహించి వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 22 నాటికి మొత్తం 16,14,198 మంది ఓటర్లు ఉన్నారన్నారని ఆమె తెలిపారు. సాధారణ ఎన్నికలు 2024 కు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వివిధ అనుమతులను సువీధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ యాప్ లో నమోదైన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 24 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆమె వివరించారు. సువీధ యాప్ వినియోగంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్ట అమలకు జిల్లాలో సీ-వీజిల్ యాప్, పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటస్టిక్స్ సర్వేలన్స్ ఇతర బృందాలు నిత్యం పర్యవేక్షణలో ఉంటాయన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు.

జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులపై నమోదైన కేసులు వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ కు నివేదిక ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని ఈ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ నుంచి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మూడు ప్రత్యేక బృందాలతో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. చెక్ పోస్ట్ లు వద్ద నిఘా వ్యవస్థను పటిష్టపరిచి మద్యం ఇతర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ సతీశ్ కుమార్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి.తిప్పేనాయక్, కాకినాడ డీఎస్పీ డా. కె హనుమంతురావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సీపీ), గదుల సాయిబాబా (టీడీపీ), కె.గంగాధర్ (బీజేపీ), సబ్బారపు అప్పారావు (బీఎస్పీ), ఎన్.వి.వి. సత్యనారాయణ (ఐఎన్సీ), కే.వీరబాబు (సీపీఎం), ఎన్నికల విభాగం అధికారి ఎం.జగన్నాధం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం ఎమ్మెల్యే టికెట్ పై అధిష్టానం పునరాలోచన చెయ్యాలి

### - టీడీపీ మండల కమిటీ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో కష్టపడిన వారికి తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి టికెట్ ఇవ్వకుండా ఎవరికి తెలియని వారు కి టీడీపి లో ఎమ్మెల్యే సీటు ఇవ్వడం ఏమిటని వంతలకు టికెట్ ఇవ్వలనీ,టీడీపి ప్రభుత్వం హాయాం లో అభివృద్ధి ఎంతో జరిగిందని అలాగే ఈ ఏడు సంవత్సరాలు ప్రజలు వద్దకే పార్టీకి తీసుకెళ్లి ప్రజల కు సైతం సేవ చేసిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పునరాలోచించి రంపచోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వంతల రాజేశ్వరికి కేటాయించాలని మండల కమిటీ ఏక గ్రీవ తీర్మానం చేసినారు. ఈ ఐదు సంవత్సరాలు పార్టీకి కష్టపడలేని వాళ్ళకి టిక్కెట్ ఇవ్వడం అనేది చాలా దారుణం అని, ఇలాంటి పొరపాటు చేసినట్లయితే రేపొద్దుట సామాన్య కార్యకర్త కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నామని, దీనిపై అధిష్టానం వెంటనే స్పందించి రంపచోడవరం టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ వెంటనే మార్చి వంతలకే ఇవ్వాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, అరకు పార్లమెంట్ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని చందు, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, యూనిట్ ఇంఛార్జి బాచినేని మల్లయ్య, సంద్ర రఘు, సబ్బినేని వేణుగోపాల్, బండారు భద్రరావు, బానోత్ సక్రు, పెద్దినేని వెంకటేశ్వరరావు, ఏపూరి వెంకన్న, పెనుబల్లి సాయిబాబు, సర్పంచ్ మోసం రాజులు, మధు, కమలాకర్, బాచినేని శ్రీకాంత్, గుత్తా వెంకన్న, సామ్య, పసుపులేటి రాంబాబు, ముత్యాలు, మాజీ సర్పంచులు పార్టీ బూత్ కన్వీనర్ లు తదితర కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కిర్లంపూడి మండలంలో టిడిపి జనసేన

## బిజెపి నాయకులను కార్యకర్తలను కలిసిన ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

**-ఉమ్మడి అభ్యర్థి నెహ్రూని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం**

**-జన సైనికులు నాయకులు హామీ**



**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కు మద్దతు తెలియజేసి గ్రామగ్రామానా బ్రహ్మరథంపట్టారు. రేపు రాబోయే ఎన్నికల్లో కలిసి పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం అని హామీ ఇచ్చిన కిర్లంపూడి మండల జనసైనికులు. కిర్లంపూడి మండలంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులతో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామాల్లో పర్యటించారు. కిర్లంపూడి మండలం జనసేన అధ్యక్షులు ఉలిసి ఐరాజు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. కిర్లంపూడి మండలంలోని బూరుగుపూడి, సోమరాయణం పేట, పాలెం, రామచంద్రాపురం, తామరాడ, ఎస్ తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, గెద్దనాపల్లి, కిర్లంపూడి, సింహాద్రిపురం, రామకృష్ణాపురం, ముక్కొల్లు, రాజుపాలెం, వీరవరం గ్రామాల్లో టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ కూటమిలో ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ప్రకటించడం జరిగిందని మీ అందరి సహకారంతో ఈ ఎన్నికల్లో నన్ను గెలిపించి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని, ముఖ్యమంత్రిగా చంద్రబాబుని, పవన్ కళ్యాణ్ ని గెలిపించుకోవాలన్నారు. దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని టిడిపి నాయకులకు, కార్యకర్త కు ఎంత ప్రాధాన్యత ఇస్తానో జనసేన బిజెపి కార్యకర్తలకు నాయకులకు అదే ప్రాధాన్యత ఇస్తానని అందరూ కలిసి ఈ వైసిపి రాక్షస ప్రభుత్వాన్ని పారదోలదామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, చదరం చంటిబాబు,,క్లస్టర్ ఇంచార్జి పాఠం శెట్టి మురళీకృష్ణ, తూము కుమార్, కుర్ల చినబాబు, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్,, కుంచె తాతాజీ, పాఠం శెట్టి రవి, పెనగంటి బాబ్జి, అడబాల కొండబాబు, కంచుమర్తి రాఘవ, అనుకూల శ్రీకాంత్, గొడే బాల, పట్టు చంటిబాబు, గారగ గోవిందు, బొజ్జపు శ్రీను, కానూరు కాసులు, సూరిశెట్టి వెంకట శివ, కాకిలేటి రాయుడు, జ్యోతుల రాంబాబు, కంటా శ్రీను, గంధం ఈశ్వరరావు, గొల్లపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
శుక్రవారం
29 మార్చి 2024


## జనసేన పార్టీ నుండి వైసిపిలోకి పలువురు చేరిక



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామంలో జనసేన పార్టీ కి చెందిన నరవ నాగేశ్వరరావు , ఉగ్గిని సత్తిబాబు , బురిడీ అబ్బులు , బురిడీ బుజ్జి , జళ్ళు వెంకటరమణ , కొత్తపల్లి పాపా తదితరులు వైసీపీ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ ఆర్ సీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు వైసీపీ కండువా కప్పి పార్టీ లోకి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి తామంతా కృషి చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా వైసీపీ పార్టీ పంచాయతి అధ్యక్షులు మోరంపూడి రంగా, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా కలెక్టర్‌గా నివాస్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా కలెక్టర్‌గా జే.నివాస్ నియమితులయ్యారు. నివాస్ ప్రస్తుతం వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు కాకినాడ జిల్లాకు కలెక్టర్‌గా కృతిక శుక్లా బాధ్యతలు నిర్వహించారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి జే.నివాస్‌ను కలెక్టర్‌గా నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2022 ఉగాదికి జిల్లాల విభజనలో నూతనంగా ఏర్పడిన కాకినాడ జిల్లాకు కృతికా శక్లా కలెక్టర్‌గా నియమితులై దాదాపు రెండేళ్ల పాటు పని చేశారు.

# ఆదిత్యలో ఘనంగా టెక్నికల్ ప్రోవేస్ -2024

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆదిత్య డిగ్రీ కళాశాల బీసీఏ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) విభాగం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రోవేస్–2024 టెక్నికల్ ఈవెంట్‌ను స్థానిక ఎన్‌ఎఫ్‌సిఎల్ రోడ్‌లో గల జి.కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య స్కూల్లో కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి.బ్యూలా తెలియజేశారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతంతో ప్రారంభమైన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు. చీఫ్ గెస్ట్ కె.కృష్ణారెడ్డి, సి.ఈ.ఓ. క్రిపి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడ. గెస్ట్ ఆఫ్ హానర్ పి.ఎస్.ఆర్.కుమార్, క్రిటివో సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ, వైస్–ప్రిన్సిపాల్ జి.సత్య మరియు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. అకాడమిక్ డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో బీసీఏ కోర్సును ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అన్ని కళాశాలల విద్యార్థినీవిద్యార్థులను ఉద్దేశించి కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు టెక్నాలజీపై పట్టు సాధించి విజేతలుగా ఎదగాలని, ఈ తరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులదని, విద్యార్థుల ఆలోచన విధానాన్ని, సమయాన్ని సరైనవిధంగా ఉపయోగించుకున్నప్పుడే ఫలితం ఉంటుందని తెలియజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో బీసీఏ కోర్సును ఇంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆదిత్య యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు అర్హత సామర్థ్యం కలిగే చైతన్యవంతులుగా అవకాశాలను విడిచి పట్టుకోవాలని సరికొత్త విధానాలతో నూతన ఆవిష్కరణలు చేసి





కళాశాలకు రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో పేరు తీసుకురావాలని, మేనేజింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలని, విద్యార్థుల ఆలోచన విధానాన్ని, సమయాన్ని, టెక్నాలజీ, తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరైన విధంగా ఉపయోగించుకున్నప్పుడే ఫలితం ఉంటుందని, ప్రస్తుతం కష్టపడిన విద్యార్థులకే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. సదస్సు కన్వీనర్ బీసీఏ ప్రిన్సిపల్ డి.బ్యూలా మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల బీసీఏ కోర్సుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, బీసీఏ చేస్తున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, బీసీఏ విద్యార్థులు తయారుచేసిన మేగజైన్ కార్యక్రమానికి హాజరైన అతిధుల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం విద్యార్థులు స్లయిడ్ స్పర్కెల్, ప్రాజెక్ట్ ఫోర్స్, పోస్టర్ ఎంట్రెగా, కోడ్ క్లాస్, బ్రెయినాథన్, మరియు స్టేజి ఈవెంట్స్ హెూమ్‌కి అంశాలతో వివిధ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ముగింపు సభలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు గారి చేతులు మీదుగా జ్ఞాపికలను ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సదస్సును నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డి. బ్యూలా, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్య పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యు.ఎల్.ఎన్. కుమార్, బి.వి. రమణ, కేసీ ప్రదీప్, ఎన్.వాణి, జి.నాగరాజ్, జి.నేరెళ్ల రెడ్డి, ఎన్.స్పందన, ఎ.రాణాప్రతాప్, గౌసియా తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గడపగడపకు వైయస్సార్ కార్యక్రమంలో వరుపులకు ఘన స్వాగతం



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలంలో ఉప్పంపాలెం,పలపు సోమవారం గ్రామాల్లో గడప గడపకు వైఎస్ఆర్ కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రత్తిపాడు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వరుపుల సుబ్బారావుకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటా మహిళలకు తమకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకే రెండు ఓటులు వేయాలని కోరారు. మరిన్ని అభివృద్ధి పథకాలు సీఎం వైఎస్ జగన్మోహన్ తోటే సాధ్యమని ఆయన వివరించారు. ఇంటింటా మహిళలు హారతులు పట్టి దీవించారు. సర్పంచ్ కోటి బాబు, మిరియాల చిట్టిబాబు,సర్నం శ్రీను, రఘు, బండారు ఏసుబాబు,రాజు, కామ్రేడ్ నాగేశ్వరావు, మరియు ఆయన వెంట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## ప్రతి గడపకు సంక్షేమం... ప్రతి బతుకులో అభివృద్ధి

### - టీడీపీ పార్లమెంటు అభ్యర్థి హరీష్ బాలయోగి





**అమలాపురం, మేజర్ న్యూస్ :** గత 5 ఏళ్లలో వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు, రాష్ట్రం ఎన్నో విధాలుగా నష్టపోయిందని తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థి హరీష్ బాలయోగి విమర్శించారు. ఈ పరిస్థితి పూర్తిగా మార్చడంతోపాటు ప్రతి గడపకు సంక్షేమం, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం టీడీపీ–జనసేన–బీజేపీ ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రజలంతా దీనిని గమనించి, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుతో ఉప్పలగుప్తాం మండలం ఎన్.కొత్తపల్లి గ్రామంలో గురువారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, టీడీపీ సారధ్యంలో ఏర్పాటు కానున్న ప్రజా ప్రభుత్వంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. 6 గ్యారంటీల మేనిఫెస్టోను అందజేసి, వాటి ఆవశ్యకతను తెలియజేశారు.

## ఎంసిసి కోడ్ పటిష్టంగా అమలు చేయాలి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలో ఎం సి సి కోడ్ అమలుతీరిపై పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని పెద్దాపురం మండల ఎంపీడీవో ఎం ఉషారాణి తెలిపారు దీనిలో భాగంగా గురువారం మండలంలోని జే తిమ్మాపురం గ్రామములోని సచివాలయం, గ్రామములో తిరిగి ఎం. సి. సి.కోడ్ అమలతీరును ఆమె పరిశీలించారు. దీనిలో భాగంగా పోలింగ్ స్టేషన్ పరిశీలించి పోలింగ్ స్టేషన్లో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఈవో అండ్ పి ఆర్ డి కే రాజశేఖర్. పంచాయతి సెక్రటరీ ఎండి సుభాని. ఉన్నారు

## 4.31 లక్షలు స్వాధీనం చేసుకున్న తహసిల్దార్..

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న ఏలేశ్వరం తాసిల్దార్ కు 4,31,000 పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించి ఏలేశ్వరం మండల తాసిల్దార్ వై రంగారావు అందించిన వివరాలు ప్రకారం. మార్చి16 నుండి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా నగదు బదిలీ కాకుండా తీసుకునే చర్యల్లో భాగంగా సరైన వివరాలని సొమ్మును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని అయినా చెప్పారు కాగా గురువారం సాధారణ తనిఖీల్లో భాగంగా ఏలేశ్వరం ఎర్రవరం ప్రధాన రహదారిలో సోదాలు నిర్వహిస్తుండగా దాడి లావరాజు అనే వ్యక్తి తన బైక్ పై తరలిస్తున్న 4.31 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకుని వివరాలు అడగ్గా తాను బ్యాంకుకు తీసుకెళుతున్నట్టు చెప్పారు అయితే సరైన ఆధారాలు సోఫా పోవడంతో ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికల నీ మమ్మల్ని అనుసరించి జిల్లా కేంద్రం ట్రెజరీకి తరలించడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సొమ్మును తరలించే సమయంలో సరైన ఆధారాలను చూపించి తీసుకెళ్లాలని ఆయన సూచించారు అలా ఆధారాలు చూపని సొమ్మును స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## బాధ్యతగా విధులు నిర్వహించాలి - డిఎల్‌డిఓ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిడిఓ బి. కృష్ణమోహన్ అధ్యక్షతన సచివాలయం ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అమలాపురం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి బదుగు వీరాస్వామి మాట్లాడుతూ మండలంలో అందరు సచివాలయం ఉద్యోగులు ఎన్నికల కోడ్ పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కోడ్ నియమాలపై నోడల్ అధికారిగా ఉన్న ఎంపిడిఓ జారీ చేసే ఆదేశాలు అమలు చేయాలని ఆదేశించారు. ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఏప్రిల్ 3న పింఛన్ల సొమ్ము బ్యాంకుల నుండి తీయడం గ్రామాల్లో పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ఎన్నికల కోడ్‌కు లోబడి జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, సచివాలయం సిబ్బంది మల్లాయమ్మ, మల్లీశ్వరి, అనూష, కోమల, లోవ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధిక మెజార్టీతో గెలిపించాలి




**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం తాడికోనలో అమలాపురం నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ గడప గడపకు తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలి అని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ ప్రభుత్వంలోని సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు లబ్ధిదారులందరికీ వారికి ఖాతాల్లో జమ వేయడం జరిగిందని ప్రజలందరూ గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఈయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మల్లెతోటలో అగ్నిప్రమాదం

### - ఐదిళ్లు అగ్నికి ఆహుతి

### - నిరాశ్రయులైన ఏడు కుటుంబాలు





చింతూరు, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మల్లెతోట గ్రామంలో గురువారం సాయంత్రం ఐదు ఇళ్ళు ఆగ్నికి ఆహుతి అయ్యాయి. కాక శరమయ్య, ప్రసాదు, ముచ్చిక బిగ్ బాస్, మల్లయ్య, కళ్యాణ్, కాక సీతమ్మ, గొర్రె పిచ్చయ్య అనే వ్యక్తుల 5 తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. మొత్తం ఐదు లక్షల ఆస్తి నష్టం ఉంటుందని తాసిల్దార్ నాజీముల్లాషా తెలిపారు. ఐటీడీఏ పీవో కావూరు చైతన్య సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను ఓదార్చారు. వారికి ప్రభుత్వం నుంచి రావలసిన సౌకర్యాలను అందజేస్తామన్నారు. ప్రస్తుతానికి దుప్పట్లు, బరకాలు సప్లై చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి తక్షణ సహాయంగా 10 కేజీల బియ్యం, ఒక లీటర్ వంటనూనె, కేజీ కందిపప్పు ఇచ్చినట్లు తాసిల్దార్ తెలిపారు. పిఒ వెంట సీనియర్ అసిస్టెంట్ పండా రామకృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

# వైకాపా నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

### - కండువాలు వేసి ఆహ్వానించిన కొండబాబు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప నేడు వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక 10 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మోసా దానమ్మ, మాజీ కౌన్సిలర్ మోస పేతురు మరియు వారి అనుచరులు సుమారు 200 మంది యువకులు, స్థానిక పెద్దలు, మహిళలు వైసీపీ నుండి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి వనమాడి కొండబాబు పార్టీ కండువా వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరానికి చేపట్టిన అభివృద్ధితో అనేకమంది నేడు తెలుగుదేశం పార్టీకి ఆకర్షితులై వైకాపా నుంచి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారని, జగన్ వింత పాలన పట్ల ప్రజలతో పాటు వైసిపి పార్టీకి చెందిన నాయకులూ కూడా చాలా అసంతృప్తిగా ఉన్నారని, విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడి పాలనలో ప్రజలు ప్రశాంతమైన జీవితం గడుపారని, నేడు జగన్ అరాచక పాలన వల్ల ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అందించు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల మ్యానిఫెస్టోను, జగన్ నియంత పాలనను ప్రజల్లోకి ప్రతి ఒక్కరూ తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా మోస దానమ్మ పేతురు మాట్లాడుతూ మత్స్యకార గ్రామాలు మత్స్యకార ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందాలంటే అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మత్స్యకార గ్రామాలు అభివృద్ధి చెందగా నేడు వైసిపి పాలనలో మత్స్యకారి గ్రామాలు అభివృద్ధి చెందకపోగా గ్రామ భూములు కబ్జాలకు గురై పెత్తందారుల చేతిలోకి వెళ్లాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోసా అప్పారావు, మోస విజయ్‌కుమార్, వాసుపల్లి అప్పారావు, వాసిపల్లి దానయ్య, గరికన రాజు, పెమ్మిడి నాగు, కుంది సంజయ్‌రావు, ఎరుపెల్లి సత్తిబాబు, రాగితి లక్ష్మి, మైలిపిల్లి సత్యవతి, కుంది రత్నం, కారే సత్యవతి, సిరిపిల్లి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళిని

# పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం

-డిసెంబర్ నెల నుంచే ఎన్నికల అమలుప్రక్రియ ప్రారంభించడం జరిగింది

-రీజియన్ పరిధిలోని ఆరు జిల్లాలలో కలెక్టర్లతో

సమన్వయం చేసుకోవడం జరుగుతోంది -ఐజి - జివిజి.అశోక్ కుమార్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రవర్తన నియమా వళిని పగడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ జి.వి. జి. అశోక్ కుమార్ అన్నారు. గురువారం కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్.పి, కొవ్వూరు టౌన్, రూరల్ పరిధిలో వార్షిక తనిఖీలు నిర్వహించడంలో భాగంగా పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఐజి .. జివిజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మార్గదర్శకా లను అనుసరించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లా కలెక్టర్ లతో ఆరు జిల్లాల ఎస్పీలు సమన్వయం చేసుకోవడం జరిగిందనీ అన్నారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియ మావళి పై శిక్ష ణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో వీఐపీలు, ప్రజా ప్రతినిధులు పర్యటించి నప్పుడు సెక్యూరిటీ పరంగా బందోబస్తులు పకడ్బందీగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డిసెంబర్ నెల నుంచే ఎన్నికల షెడ్యూలు విడుదల కాకుండానే ఎన్ఫోర్స్మెంట్ అమలు ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. ఆరు జిల్లాల పరిధిలో 1842 నాన్ బెయిలబుల్ వారెంట్ ఎక్జిక్యూట్ చేయడం జరిగిందన్నారు. ఐ డి లిక్కర్, పులిసిన బెల్లం ఊట, ఎన్ డీ పీఏల్ సీసాలు, టెట్రా ప్యాకెట్లు, డి పి ఎల్ (గంజా), ఎన్ డి పి ఎస్, క్యాష్, ప్రీసియస్ మేటల్, ఫ్రీ బీస్ తదితరాలు చెంది 7489 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేసి, 4067 మందిని అరెస్ట్ చేసి రూ.15,53,74,279 /– లు విలువ కలిగినవాటిని సీజ్ చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి దాడులు మరింత తీవ్రతరం చెయ్యడం జరిగిందన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సరళి పై పోలీసు సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంలో తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి. జగదీష్ , కొవ్వూరు డివిజన్ డి.ఎస్.పి కే. సిహెచ్. రామారావు, కొవ్వూరు టౌన్ ఇన్స్పెక్టర్ వి. జగదీశ్వర్ రావు, కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## జగ్గంపేట నియోజకవర్గ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం



జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేటలో గురువారం వెంకటనాగ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన నియోజకవర్గలోని పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసారు. జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సునీల్ మాటాడుతూ తాను కాకినాడ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక మానిపెస్టో సిద్ధం చేసుకుని మీ ముందుకు వచ్చానని అన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో నిరుద్యోగులకు, యువతకు మంచి ఉద్యోగాలు సాధించేందుకు భారీ ట్రైనింగ్ సెంటర్ కాకినాడలో ఏర్పాటు చేస్తానని తెలిపారు. స్టార్టప్ పండ్ సమకూర్చి 100 చిన్నతరహా పరిశ్రమలు స్థాపించనున్నట్లు చెప్పారు. జగన్మోహన్రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల జగ్గంపేట నియోజకవర్గంలో 95శాతం ఇళ్లకు మేలు జరిగిందని అన్నారు. జగన్ చేసిన మేలు ప్రతి ఇంటికి వివరించగలిగితే గెలుపుకు ఇదే మార్గమని అన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 400మేలు జరిగిందని అన్నారు. జగన్ చేసిన మేలు ప్రతి ఇంటికి వివరించగలిగితే గెలుపుకు ఇదే మార్గమని అన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 400 గ్రామాలు దత్తత తీసుకుని కోటి రూపాయిలతో అభివృద్ధి చేస్తానని హామి ఇచ్చారు. రాబోయో ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించి, జగన్మోహన్రెడ్డిని సీఎం చేయడంతోపాటు కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా తనని, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట నరసింహాన్ని గెలిపించడానికి పార్టీ శ్రేణులంతా 45 రోజులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. జగన్మోహన్రెడ్డి బస్ యాత్ర మన నియోజకవర్గానికి వచ్చినపుడు ఘనస్వాగతం పలకడానికి పార్టీ శ్రేణుల సిద్ధంగా వుండాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం మాట్లాడుతూ ఈసారి ఎన్నికలలో సునీల్ తాను జంటగా బరిలోకి దిగామని మా విజయం తథ్యమని అన్నారు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ మిధునరెడ్డి పార్టీ నేతలమధ్య సమన్వయం కల్పించడంలో చూపించన చొరవ వల్ల కాకినాడ జిల్లాలోవిజయశంఖారావం పూరించడం ఖాయమని అన్నారు. మెట్టను సస్యశ్యామలం చేయడానికి గతంలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. పార్టీ శ్రేణులు 45 రోజులు పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు. అనారోగ్యంతో వున్న తనకి దేవుడు పునర్జన్మ ప్రసాదిస్తే, జగనన్న రాజకీయ పునర్జన్మ ఇచ్చారని ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా గెలుపు గుర్రంగా మూడోసారి హాట్రిక్ సాదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ పి.శివకుమార్ మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి సంక్షేమ, పారదర్శక పాలన వల్ల నేడు ప్రజలవద్దకు ధైర్యంగా వెళ్లి ఓట్లు అడగగలుగుతున్నామని అదే–టిడిపికి ఓట్లు అడిగే హక్కులేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, యువనేత తోట రామోజీ కాకినాడ కోఆర్డినేటర్ ఉమ్మ రఘురాం, వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు నాలుగు మండలాల నుండి వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గొరకపూడి చిన్నయ్యదొరను కలిసిన చలమలశెట్టి సునీల్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గురువారం సాయంత్రం సామర్లకోటలో వైసీపీ నాయకులు గొరకపూడి చిన్నయ్యదొరను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్, గుబ్బల సత్తిబాబు, సేపేని సురేష్, శ్యయంవరపు వీరభద్రరావు, మద్దాల శ్రీను, గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి,చిట్టిమాని శ్రీను,పెండ్యాల అబ్బు,నమ్మి శ్రీను, దూది రాజుబాబు తదితరులు ఉన్నారు.

# బడిలోనే భవిష్యత్తు...!

### -వెల్లచింతలగూడెంలో బడిబాట కార్యక్రమం



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండలంలోని వెల్లచింతలగూడెం మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వెల్లచింతలగూడెం క్యాచ్‌మెంట్ ఏరియాలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయని ఎన్‌సీహెచ్. రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. మనిషి యొక్క ఉజ్వల భవిష్యత్తు బడిలోనే ఆవిష్కృతమవుతోందని అన్నారు. చదువుతో పేదరికం దూరమవుతోందని అన్నారు. సమాజం అభివృద్ధికి దోహదమవుతోందని అన్నారు. 5ఏళ్ల ప్రతి ఒక్కరూ బడిలోనే ఉండాలని సూచించారు. బడిబయట ఉన్నవారు, 5ఏళ్ల నిండిన వారిని గుర్తించి వారి వివరాల నమోదు చేసుకున్నారు. మొత్తం 50 మంది పేర్లను నమోదు చేశారు. పాఠశాల పున:ప్రారంభానికి అడ్మిషన్లు ఇవ్వనున్నారు. అనంతరం విద్యార్థులు రాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ కొయ్య నాగరాజు, అంగన్వాడీ టీచర్స్ హేమలత, కమల కుమారి, ఉపాధ్యాయులు హేమ శిరీష తదిరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఖర్చుల నిర్వహణ ఎలా..?

**- దివాలా తీసిన పంచాయితీలు**
**- తమకు సంబంధం లేదంటున్న రెవిన్యూ అధికారులు**
**- కార్యదర్శులపైనే భారం**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సాధారణ ఎన్నికలు వచ్చేస్తున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రోజువారి ఎన్నికల ఖర్చులు ఎవరు భరించాలి అన్నది ప్రశ్నర్థకంగా మారింది. రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 72 మండలాలుగాను 65 కు పైగా మండలాల్లో తాసిల్దార్లు కొత్తవారు వచ్చారు. ఇతర జిల్లాల నుంచి వచ్చారు కాబట్టి నిర్మొహమాటంగా తమకు ఎలాంటి ఖర్చులతో సంబంధం లేదని చెప్పేస్తున్నారు. అదేవిధంగా పూర్తిగా ఎండిఓలు కూడా బదిలీ అయ్యారు. వారు కూడా ఇతర జిల్లాల నుంచి వచ్చారు. ఇలాంటి నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతోంది. గ్రామాలలో తిరుగుతున్న ఫ్లయింగ్ స్క్వాడ్ లేదా ఇతర ఎన్నికల అధికారులకు అల్పాహారం, భోజనాలు, ఒక్కోసారి రాత్రి బస పంచాయతీ కార్యదర్శులు చూడాల్సి వస్తోంది. గతంలో పంచాయతీలలో ఖర్చులు సర్పంచులు భరించేవారు. కోడ్ కారణంగా వారిని పంచాయతీలకు రానివ్వడం లేదు. ఈ నేపథ్యంలో తమ చేతి చమురు వదులుతోందని కార్యదర్శులు వాపోతున్నారు. వాస్తవానికి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నిధులు విడుదల చేస్తుంది. కానీ అవి ఇంకా రాలేదు. అయితే కోడ్ అమల్లోకి రావడం, తనిఖీలు ముమ్మరం చేయడం దీనికి తోడు సి-విజిల్ యాప్‌తో ప్రతిరోజు వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామాలలో ప్రచార సంబంధ సామగ్రి, ఫ్లెక్సీలు లేదా ఎక్కడైనా రాజకీయ నాయకుల ఫోటోలు జెండాలు కనిపిస్తే తొలగించాలి. ఆ భారం మొత్తం పంచాయతీలపైనే పడుతోంది. ఏడాది నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఆర్థిక సంఘం నిధులు కూడా లేవు. కేవలం ఇంటి పన్నులపై వచ్చే ఆదాయంతో మాత్రమే పంచాయతీలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తాము అప్పుల పాలయ్యామని, జీతాలు నుంచి ఖర్చు పెట్టామని, ఇక ఖర్చు చేయలేమని చెప్పేస్తున్నారు. ప్రతిరోజు సి-విజల్ కు కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ప్రత్యేక బృందాలు గంటల వ్యవధిలో అక్కడికి వచ్చి వాటిని తొలగించే బాధ్యత కార్యదర్శులకు అప్పగిస్తున్నారు. ఇటీవల కాకినాడ రూరల్ రిటర్నింగ్ అధికారి, కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి వాటర్ ట్యాంకులకు వేసిన రంగులు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి ఇవి ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో ఉంటాయి. కానీ వాటిని తొలగించాలని కార్యదర్శులకు సూచించారు. తమ వద్ద డబ్బులు లేవని వారి చేతులెత్తేసారు. దాంతో వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. డబ్బులు ఇవ్వకుండా పనులు ఎలా చేయాలని కార్యదర్శులు అడుగుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేదు, రోజువారీ ఖర్చులు వేలల్లో ఉంటున్నాయి. ఇక తాము కూడా భరించలేము. ఇలా అయితే సెలవు పెట్టేస్తామని కార్యదర్శులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమపై పెత్తనం చేయడం, ఆర్థిక భారం మోపడం మానుకోవాలని, లేనిపక్షంలో తాము సెలవుపై వెళ్ళిపోతామని కార్యదర్శులు అల్టిమేటం జారీ చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణం .మండల పరిధిలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా మొత్తం 16 89 మంది విద్యార్థులకు గాను 1674 మంది హాజరు కాగా 15 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈఓ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

## ఈ నెల 30న ఉపకరణాల పంపిణీ నిర్ధారణ శిబిరం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సమగ్ర శిక్ష కాకినాడ జిల్లా సహిత విద్య విభాగము వారి ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి రమేష్ ఆదేశాలను అనుసరించి ఈ నెల 30న వివిధ లోపాలు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ నిర్ధారణ నిమిత్తం పిఠాపురంలో ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ లు శర్మ చౌదరిల్లు తెలిపారు. ఒక ప్రకటనలో భాగంగా తెలుపుతూ కాకినాడ జిల్లాలో గల పిఠాపురం గొల్లప్రోలు యు.కొత్తపల్లి సామర్లకోట పెద్దాపురం మండలాలకు సంబంధించి ప్రభుత్వ మరియు భవిత సెంటర్లో 1 నుండి 12 వ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కొరకు నిర్ధారణ నిమిత్తం వివిధ లోపాలు గల విద్యార్థుల గుర్తింపు శిబిరాన్ని పిఠాపురంలో గల గర్ల్స్ హై స్కూల్ నందు నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమనికి పెద్దాపురం మండలం నుండి 30 మంది పిల్లలు మరియు 30 మంది తల్లితండ్రులు పాల్గొంటారని ఈ దివ్యాంగులను పిల్లలను పరీక్షించడానికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ డాక్టర్లు అయినటువంటి డాక్టర్ జి మాధురి డాక్టర్ ఆరో ఉమామహేశ్వరి డాక్టర్ సిహెచ్ ఎస్ వి కృష్ణా వాసన్ పాల్గొననునట్లు ఎంఇఓలు తెలిపారు.

# టీడీపి గెలుపు తథ్యం

### -జాతీయ ప్రధాన కార్యదర్శి కె. జవహర్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని జాతీయ ప్రధాన కార్యదర్శి కె. జవహర్ అన్నారు. గురువారం జవహర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా అందరూ త్యాగాలకు సిద్ధపడాలని చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు కు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. కొవ్వూరులో రాజకీయ పరిస్థితులు అందరికీ తెలుసునని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. చంద్రబాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా టిడిపి విజయానికి కృషి చేస్తానన్నారు. టిడిపి నాయకుల్ని,కార్యకర్తలని కలుపుకొని సమన్వయంతో పని చేస్తానని తెలిపారు. టిడిపి పార్టీకి కట్టు బానిసగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని వ్యక్తుల కొరకు కాదని జవహర్ అన్నారు. కార్యకర్తలకు ప్రజలకు అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు.ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొండిగోడలతో దర్శనం ఇస్తున్న కాలనీలు

### -పోలవరం నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరం




**వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్ :** పోలవరం నిర్వాసితులకు ఎన్నికష్టాలో కాలనీలు పూర్తిచేయరు, ఆర్&ఆర్ ఊసేలేదు, కొన్నిభూములకు డబ్బులు ఇచ్చినా..! కొన్నింటిని అశ్రద్ధ చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుతున్నారు. త్యాగాలు మరిచారు. అవసరాలు తీరాయి.నిర్వాసితులకుచుక్కలు చూపిస్తున్నారు. అధికారపార్టీ పొలవరాన్ని మేమే పూర్తి చేశాం అంటుంది.ప్రతిపక్ష పార్టీ70%మేమే చేశామని గొప్పలు చెబుతున్నారు. ఇంత పూర్తిచేసిన అని డబ్బా కొట్టే ఈనాయకులు, ప్రాజెక్టు నిర్మాణంతో సమాంతరంగా ప్యాకేజీ ఇందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. శంకుస్థాపన రోజు ఉన్న మాటలకు ఇప్పుడున్న మాటలకు ఎంతో వ్యత్యాసం ఉంది.ప్రతీ ఏడాది ఈకష్టాలేనా! ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్నశ్రద్ధ నిర్వాసితుల మీద ఎందుకులేదు. మేం! ఏం! పాపం చేశాం,అన్నింటికీ అంగీకారాన్ని తెలపడం మేం చేసిన తప్పా?వర్షాకాలం వస్తే తీవ్రమైన ఒత్తిడికి గురౌతున్నాం, కొన్ని, కొన్ని,సందర్భాల్లో భారీగా నష్టపోతున్నాం ఎన్నికల వేళ మా ఇబ్బందులకు సరైన హామీలు ఇవ్వాలని,కాంటూర్లు కథమాని నిజమైన నిర్వాసితులకు న్యాయం చేస్తారని ఆశగా పోలవరం నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. మొండి గోడలతో ఇళ్ళ నిర్మాణాలు నిలిచిపోయాయి.పోలవరం నిర్మాణం ఎంత అవసరమో నిర్వాసితుల,ప్యాకేజీ ఇవ్వడంఅంతేఅవసరం. ఆలోచన చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న రైల్వే ప్రైవేట్ పార్సిల్ కాంట్రాక్టర్ భాష



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట రైల్వే స్టేషన్లో నిస్సహాయంగా పడి ఉన్న సుమారు 70 సంవత్సరాల పైబడిన ఉన్న వృద్ధుడిని మానవత్వంతో పెరిగిన జుట్టు గడ్డం తీయించి స్థానం చేయించి కొత్త బట్టలు వేసి ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించిన సామర్లకోట ప్రైవేట్ రైల్వే పార్సెల్ కాంట్రాక్టర్ భాషను స్టేషన్ మేనేజర్ రమేష్ ఆర్ పి ఎఫ్ పోలీసులు మరియు జి ఆర్ పి ఎఫ్ పోలీస్ సిబ్బంది అభినందించారు.

# బాలికపై కోతుల దాడి

**-ఇటీవలే కోతులదాడిలో విద్యార్థికి తీవ్ర గాయాలు**
**-అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు డియాండ్**



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దాపురం గ్రామంలో నాలుగు ఏళ్ల బాలికపై కోతులు దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లపూడి మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన కొందరు కూలీలు వర్జినియా పొగాకు పనుల నిమిత్తం పెద్దాపురం వలస వచ్చారు. అయితే పెద్దవాళ్లు అంతా పొలాల్లోకి పనులకు వెళ్లిపోయారు. నాలుగు సంవత్సరాల బాలిక ఆడుకుంటూ ఉండగా ఎక్కడి నుంచో వచ్చిన కోతులు గుంపు బాలికపై దాడి చేశాయి. ఆ బాలికకు చెందిన తలకు ఎక్కువ శాతం గాయం అయ్యింది. హుటాహుటిన స్థానికులు బాలికలు గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు బాలికకు వైద్య సేవలు చేశారు. ఇది ఇలా ఉంటే ఇటీవలే కోతుల మూక దాడిలో ఒక విద్యార్థి తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఆ సంఘటన మరువకముందే మరో ప్రమాదం చోటు చేసుకున్నది. దీనితో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న కోతల మూక బేడదు లేకుండా చూడాలని పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

## రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ధాన్యం కొనుగోలుపై శిక్షణా తరగతులు




**కాకనాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రబీ సీజను 2023-24కు గాను రైతులు పండించిన ధాన్యమును నిర్దేశించిన కనీస మద్దతు ధర ప్రకారము సేకరణ చేయునిమిత్తం, కాకినాడ జిల్లాలో గల 214 రైతు భరోసా కేంద్రాల యందు విధులు నిర్వర్తించు సంబంధిత అందరు సిబ్బందికి అనగా ఎడిఎ లు, ఎంఏవో లు, విఎఎ/విహెచ్ఎ లు, డిఈవో, టిఎ, హెల్పర్ లకు శిక్షణ తరగతులు గురువారం విధాన గౌతమి మీటింగ్ హాలు, కలక్టరువారి కార్యాలయం, కాకినాడ నందు నిర్వహించుట జరిగినదని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాల సరస్వతి ఒక ప్రకటనలో తెలియచేశారు.ధాన్యము కొనుగోలు కేంద్ర సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ పలు సుచనలు చేసియున్నారని, ధాన్యము కొనుగోలులో మధ్యవర్తులు ప్రమేయం లేకుండా చూడాలని అధికారులకు మరియు సిబ్బందికి ఆదేశించారని తెలిపారు. ధాన్యము కొనుగోలు చేసిన ప్రతి రైతు యొక్క వేలి ముద్రలు సేకరించాలని మరియు తద్వారా దళారులను అరికట్టవచ్చు అని తెలియజేశారన్నారు. గ్రామ స్థాయిలో మరియు మండల స్థాయిలో ప్రణాళిక తయారు చేసుకొని గోను సంచులను మరియు జిపిఎస్ అమర్చినవాహనములను సిద్దము చేసుకోవాలని ఆదేశించారన్నారు. ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని మరియు వాటిని ఉల్లంఘించినవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొనబడునని తెలియజేశారని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎమ్.బాల సరస్వతి తెలియజేశారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

### -అవకాశం వచ్చింది స్థానికుడ్ని ఎన్నుకోండి -దవులూరి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకొని పెద్దాపురం ఎమ్మెల్యేగా నన్ను గెలిపించండి అని దవులూరి దొరబాబు అన్నారు గురువారం పెద్దాపురం పట్టణంలో గల స్థానిక 25 వ వార్డులో వైయస్సార్ పార్టీ ప్రసార కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గా హరిబాబు దవులూరు దొరబాబును నెక్కంటి సాయి ప్రసాదులను పూలమాలలు వేసి సాధారంగా ఆహ్వానించి ప్రసారం ప్రారంభించారు గడపగడపకు తిరుగుతూ దవులూరి దొరబాబు మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వానికి రెండోసారి అవకాశం ఇవ్వాలని అలాగే స్థానికుడిగా తనను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు వైసీపీ నాయకులు తాటికొండ పెద్దకాపు, షేక్ రఫీ, బద్ది వీరబాబు, పత్రి మరిడియా, పట్టపగల సత్యనారాయణ, బొబ్బిలి వెంకన్న, పైలి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.శరత్ చౌహాన్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** చారిత్రాత్మక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల (ఆర్ట్స్ కళాశాల) రాజమండ్రి ని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. శరత్ చౌహాన్ గురువారం సందర్శించడం జరిగింది. రాజమండ్రి పట్టణ ఆర్డీవో ఏ. చైత్ర వర్షిణి ఈ సందర్భంగా కళాశాలకు విచ్చేశారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పని చేసిన తత్వశాస్త్ర విభాగమును, కందుకూరి వీరేశలింగం పనిచేసిన తెలుగు విభాగమును, ఎంతో ప్రాచీనమైన గ్రంథాలకు నిలయమైన కళాశాల గ్రంథాలయమును, పురాతనమైన పరికరాలు గల భౌతికశాస్త్ర యాంటిక్ ల్యాబ్ ను, అంబేద్కర్ విగ్రహంను , తరగతి గదులను శరత్ చౌహాన్ సందర్శించడం జరిగింది. ఎంతో చారిత్రాత్మకమైన మరియు మహనీయులు నడిచిన ఆర్ట్స్ కళాశాలను సందర్శించడం తనకు ఎంతో గర్వకారణంగా వుందని, ఒకవైపు సాంకేతికా భివృద్ధితో ముందడుగు వేస్తూనే, చారిత్రక వారసత్వ సంపదను సంరక్షిస్తున్న విధానం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు . తమ తాతగారు డా.భాగవతుల అప్పారావు ఇదే కళాశాలలో 74 సంవత్సరాల క్రితం తత్వ శాస్త్ర అధ్యాపకులుగా సేవలు అందించారని, అలాంటి కళాశాలను సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు ప్రారంభించి నిర్వహిస్తున్న అర్బన్ కాఫీ సెంటర్ మరియు జూట్ బ్యాగ్ స్టార్ట్ అప్ ను శరత్ చౌహాన్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు ఈ కళాశాల పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని కోరారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ శ్రీశైల శాస్త్రి , ఐ.క్యూ.ఏ. సి. సమన్వయకర్త డా.ఏ.అన్నపూర్ణ , అకడమిక్ సెల్ సమన్వయకర్త డా.సంజీవ్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి. చంద్రశేఖర్ , టి. సోనీ , కంప్యూటర్ విభాగాధిపతి డా. డి. సునీల్ కుమార్, కళాశాల వివిధ విభాగ అధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హెూం ఓటింగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### -రూరల్ ఆర్వో తేజ్ భరత్



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హెూమ్ వోటింగ్ పై రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల అధికారులు, బి ఎల్ వో లు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా జాయింట్ కలక్టరు ఏన్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం సాధారణ ఎన్నికలు-2024 కి సంబంధించి సహాయ రిటర్నింగ్ అధికారులకు , డిప్యూటీ తహశీల్దార్లకు మరియు సెక్టార్ అధికారులకు, జెసి ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆర్వో తేజ్ భరత్ మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హెూం ఓటింగు కోసం ఎన్నికల కమీషన్ మార్గదర్శకా లను విడుదల చెయ్యడం జరిగింది అని పేర్కొన్నారు. ఆమేరకు సదరన్ ధ్రువపత్రాలు ఉన్న 18 ఏళ్లు నిండిన ఓటర్లు, 85 సంవత్సరాలు నిండిన ఓటర్ల ను గుర్తించి, వారికి హెూం ఓటింగు పై అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కును వినియోగించు కోవడం కోసం పోలింగ్ కేంద్రానికి రాలేని వారికీ ఫారం 12 డి అందజేసేందుకు నిర్దేశించిన నియమాలను వివరించడం, స్వయంగా పోలింగ్ కేంద్రానికి వొచ్చి ఓటు హక్కును వేసే ఆసక్తి ఉన్న వారి నుంచీ ఆమేరకు నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం లో సహాయ రిటర్నింగ్ అధికార్లు మరియు తహశీల్దార్లు వై.కె.వి.అప్పారావు,బి.రమాదేవి, ప్రధానోపాధ్యాయులు , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వివేకానంద స్కూల్ ప్రథమ వార్షికోత్సవం వేడుక



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రత్నంపేట నందు శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు స్థానిక లైన్స్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ కె.వి.ఎస్.జి. మురలీకృష్ణ, రామచంద్రపురం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.దొరరాజు, ఎంఈఓ ఎం.శ్రీనివాస్ లు మాట్లాడుతూ పిల్లలు విద్యుత్తు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అదేవిధంగా విద్యతోపాటు ఆట పాటలు మరియు సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వలన శారీరానికి మంచి వ్యాయామం అని తద్వారా విద్యార్థులకు మనశ్శాంతితో మంచి ఆలోచనలు పెరిగితాయని మంచి నడవడిక సత్ప్రవర్తన అలవాటు అవుతుందని వారు అన్నారు.ఈ సందర్భంగా శ్రీ వివేకానంద విద్యాలయాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ శైలు, సిహెచ్ వికాస, అకాడమిక్ డీన్ మరియు చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎన్.సి.ఆర్.టి, సిలబస్కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చే ప్రవేశపెట్టిన విద్యా విధానాన్ని మరియు ఒలంపియాడ్ మరియు నీట్ కోర్సును మూడవ తరగతి నుండి 9వ తరగతి వరకు అమలుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులచే కొన్ని సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వివేకానంద స్కూల్ బోధన మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జోరుగా వనిత ప్రచారం

### -రాంపాలెంలో గడపగడపకు వెళ్లిన తానేటి



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్‌పీసీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత తన ప్రచారంలో జోరు పెంచారు. గోపాలపురం మండలం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన వనిత తొలి రోజు గంగోలు పంచాయతీ పరిధిలోని హుకుంపేట, గురువారం రాంపాలెం గ్రామాల్లో ప్రచారాన్ని కొనసాగించారు. గడపగడపకు వెళ్లి ఓటర్లను పలకరిస్తూ కరపత్రాలను అందించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు. ఆమెతో పాటు గోపాలపురం మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.